● రిషీ యూబీఆర్ విద్యార్థుల సత్తా

సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఇంటర్ కాలేజ్ జూడో టోర్నమెంట్ 2025-26 నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో హైదర్‌నగర్ సమతానగర్‌లోని రిషీ యూబీఆర్ కళాశాల విద్యార్థినులు పతకాలు సాధించారు. వీరిని కళాశాల కార్యదర్శి ఎంఎస్ రాజశ్రీ, అకడమిక్ డైరెక్టర్ మాధవీలత, ప్రిన్సిపాల్, హెచ్ఓడీలు, ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి అభినందించారు. - హైదర్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

ముగిసిన పవిత్రోత్సవాలు

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న శ్రీవారి పవిత్రోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయంలో స్వామి వారికి పూర్ణాహుతి వేడుకలతో పాటు స్నపన తిరుమంజన పూజలను ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈవో రమేశ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జూబ్లీహిల్స్‌లో బీజేపీని గెలిపించాలి

హైదర్‌నగర్: జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా ఎర్రగడ్డ డివిజన్ శాస్త్రీనగర్‌లో పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి బీజేపీకి ఓటు వేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షురాలు స్రవంతి, డివిజన్ అధ్యక్షుడు విఙయ్‌కుమార్, అశోక్‌రెడ్డి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

రియల్‌ఎస్టేట్ వ్యాపారి అదృశ్యం

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన న్యూహఫీజ్‌పేటలో జరిగింది. కొండాపూర్ పరిధిలోని న్యూహఫీజ్‌పేట్‌కు చెందిన బిడేకెయిన్ హనుమంత్ (52) రియల్‌ఎస్టేట్ వ్యాపారి. మొదట శోభను. తర్వాత సాంగమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. రెండు కుటుంబాలు సఖ్యతగా జీవిస్తున్న సమయంలో, 2016లో హనుమంత్ మరో మహిళతో సంబంధం పెట్టుకోవడంతో కుటుంబ కలహాలు తలెత్తాయి. కాగా గత సెప్టెంబరు 10న తన తండ్రిని చివరి సారిగా జూబ్లీహిల్స్‌లోని సాంగమ్మ ఇంటిలో చూసిన తర్వాత ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్ అయ్యిందని, ఆ తర్వాత నుంచి ఎలాంటి సమాచారం లేదని పేర్కొంటూ పెద్ద భార్య కుమారుడు బిడక్రైన్ దత్తు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాంగమ్మ కుటుంబం కూడా స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ముగిసిన లీడర్షిప్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2025 కార్యక్రమం

రాయదుర్గం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేగంగా మార్పులు చెందుతున్న టెక్నాలజీని యువత అందిపుచ్చుకుని ఉపాధి అవకాశాలు పొందాలని తెలంగాణ కౌన్సిలర్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలోని టీహబ్‌లో కోహర్ట్ లీడర్‌షిప్ ఎక్స్‌లెన్స్ కాన్‌క్లేవ్ అవార్డు 2025 కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. కోహర్ట్ వ్యవస్థాపకుడు, సీఈవో క్రిష్ చింతలూరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశ్రమల ప్రతినిధులు, ఆవిష్కర్తలు పాల్గొన్ని విశ్లేషణాత్మక చర్చలు జరిపారు. లీడర్‌షిప్, ఇన్నోవేషన్, ట్రాన్స్‌ఫర్‌మేషన్ అనే థీమ్‌తో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల మధ్య సహకారం, వ్యూహాత్మక ఆలోచన, భవిష్యత్‌లో మార్గనిర్దేశం చేసేవిధంగా ఈ కార్యక్రమం నిలిచింది. బిజినెస్, అకడమిక్, ప్రభుత్వ ప్రతినిధుల మధ్య స్ఫూర్తిదాయకమైన చర్చలు, కీలక ప్రసంగాలు నిర్వహించారు. నిఖిల్ చక్రవర్తి, ఎం.సత్యప్రసాద్, హేమంత్ కుమార్‌రావు, నలంద యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సునాని యాసింగ్ పాల్గొన్నారు.

నాలా కన్వర్షన్ సమస్యను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నాలా కన్వర్షన్ సమస్యలతో సతమతమవుతున్న హెచ్ఎండీఏ పరిధిలోని స్థల యాజమానులు, నిర్మాణదారుల సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు. ఈ మేరకు సీఎంకు లేఖ రాసినట్లు ఆయన వెల్లడించారు. కొన్ని సంవత్సరాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అప్పట్లో ధరణిలో ఎంట్రీ లేకపోవడంతో సమస్య తలెత్తిందన్నారు. స్థలంలోని 15 శాతం భాగాన్ని తాకట్టుగా పెట్టుకొని భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నా, పనులు పూర్తయిన తర్వాత నాలా కన్వర్షన్ సమస్యతో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ రావడం లేదన్నారు. ఈ కారణంగా నిర్మాణదారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారని సీఎంకు వివరించారు. నిర్మాణాలు పూర్తయిన వాటికి నాలాకు సంబంధించిన చార్జీలు తీసుకొని ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలని సీఎంను కోరినట్లు తెలిపారు.

దీపావళి శుభాకాంక్షలు

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలియజేశారు.



బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు: వక్తలు

పంజాగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): బీసీ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, ఫార్వర్డ్ కులాలను దూషిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలు చేయడం సరికాదని పలువురు వక్తలు అన్నారు. ఈబీసీ సంక్షేమ సంఘం, ఈబీసీ జేఏసీల ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈబీసీ హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం, భవిష్యత్ కార్యాచరణపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జేఏసీ జాతీయ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిల భారత వెలమ సంఘం ఉపాధ్యక్షుడు నీలగిరి దివాకర్‌రావు, తెలంగాణ కమ్మ సంఘం అధ్యక్షుడు రవిశంకర్ రావు, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ నాయకుడు సుబ్బారావు, జేఏసీ నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు రాజేందర్‌సింగ్, యాదగిరిగుప్త, రమణారావు, సుఖురామ్, సుబ్రమణ్యంరాజు, పద్మారెడ్డి, లక్ష్మణాచారి, కోటేశ్వరశర్మ, వెంకట్‌రెడ్డి, యూసుఫ్‌బాబు తదితరులు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్‌కు సంబంధించి న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సందర్భంగా ఫార్వర్డ్ కులాలు అంతా బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమని, వారిని రాజకీయ బహిష్కరణ చేయాలని మాట్లాడడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ఫార్వర్డ్ కులాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.


అభివాదం చేస్తున్న ఈబీసీ సంక్షేమ సంఘం, ఈబీసీ జేఏసీ ప్రతినిధులు

డ్రైనేజీ సమస్యలు పరిష్కరిస్తా

- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని షిరిడీ నగర్‌లో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. షిరిడీ నగర్ కాలనీలో ఓపెన్ నాలాకు రిటైనింగ్ వాల్ కొంతమేర పెండింగ్ ఉందని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులు కాలనీ అసోసియేషన్ కార్యాలయం నిర్మించుకుంటామని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. అసోసియేషన్ కార్యాలయం నిర్మాణం కోసం సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

దోచుకున్న డబ్బుల కోసమే కేటీఆర్, కవిత పంచాయితీ

● **కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా దోచుకున్న డబ్బును దాచుకోవడం కోసం కేటీఆర్, కవిత గొడవ పడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. మిగులు ఆదాయంతో ఉన్న తెలంగాణలో కేసీఆర్ రూ.10 లక్షల కోట్ల అప్పు చేశారని విమర్శించారు. లక్ష్మీనర్సింహనగర్ క్రీడా మైదానంలో బీజేపీ బూతు స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో మార్పు తెస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, మహిళలకు రూ.2500 ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కేంద్రప్రభుత్వం మహిళా పొదుపు సంఘాలకు రుణాలు ఇస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు కూడా రెండు సంవత్సరాలుగా చెల్లించడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం మూడు పార్టీలు కుటుంబ పార్టీలనీ ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్, గంగరాజు, ప్రేమ్‌కుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌యాదవ్‌ను గెలిపించండి

● **సినీ నటుడు సుమన్**


యూసుఫ్‌గూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సినీ నటుడు సుమన్

బంజారాహిల్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని సినీ నటుడు సుమన్ ఓటర్లను అభ్యర్థించారు. యూసుఫ్‌గూడలో ఆదివారం నవీన్‌యాదవ్ తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవీన్ మొదటి నుంచి ఆదర్శభావాలు కలిగిన వ్యక్తి అని, అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవడం వల్ల జూబ్లీహిల్స్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. అదే విధంగా ఎల్లారెడ్డిగూడ, కృష్ణదేవరాయనగర్, ఇంజనీర్స్ కాలనీలో నవీన్‌యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు సంతోష్‌గౌడ్ ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేటర్ సంగీతాశ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: సాయికిరణ్

రామంతాపూర్: స్థానిక సంస్థలు, చట్ట సభలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం చేపట్టిన ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రామంతాపూర్, హబ్సిగూడ బీసీ జేఏసీ కన్వీనర్ గడ్డం సాయి కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీసీ ఓట్లు దండుకొని గద్దె నెక్కిన ప్రజాప్రతినిధులు రిజర్వేషన్ల విషయంలో బీసీలను మోసగిస్తున్నారని ఆయన విమర్శించారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి


టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఏఐసీసీ కేకేసీ ప్రతినిధి లక్ష్మణ్, జాతీయ కో ఆర్డినేటర్ డా.పీవీ రవిశేఖర్‌రెడ్డి

పంజాగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. ఆదివారం ఆలిండియా కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) కేకేసీ విభాగం ప్రతినిధి లక్ష్మణ్, జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీ రవిశేఖర్‌రెడ్డిలు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఏఐసీసీ కో ఆర్డినేటర్ డా.రవిశేఖర్‌రెడ్డికి ముఖ్యమైన బాధ్యతలను అప్పగించాలని కేకేసీ విభాగం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ ఉదిత్‌రాజ్ రాసిన లేఖను వారు మహేష్ గౌడ్‌కు అందజేశారు. ఉపఎన్నిక బాధ్యత తీసుకుని నవీన్‌యాదవ్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

రేపు ఖైరతాబాద్ సదర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చౌదరియాదయ్య యాదవ్, సభ్యులు

ఖైరతాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): యాదవులు ఆనందోత్సాహాలతో జరుపుకునే సదర్ పండుగను ఖైరతాబాద్‌లో ఈ నెల 21 మంగళవారం నాడు నిర్వహించనున్నట్లు మంగళరాపు చౌదరి యాదయ్య యాదవ్ తెలిపారు. ఆదివారం ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం కాలం నాటి నుంచి నగరంలో 18 చోట్ల సదర్ ఉత్సవాలు జరుగుతాయని, ప్రతీ చోట సదర్ నడిపే వారిని చౌదరిలుగా నిజాం ప్రకటించారని అన్నారు. ఖైరతాబాద్ భారీ గణపతి ప్రాంగణం నుంచి రైల్వే గేటు వరకు సాయంత్రం 6 గంటలకు జరిగే సదర్ సమ్మేళనంలో ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఖైరతాబాద్‌కు దోమల్‌గూడ, చింతలబస్తీ, అమీర్‌పేట, పంజాగుట్ట, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల నుంచి యాదవులు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు. హాజరైన ఒరేటి దున్నపోతుకు మెడల్ అందజేసి నిర్వాహకులకు సత్కారం ఉంటుందని యాదయ్య తెలిపారు. సమావేశంలో చౌదరి కుటుంబ సభ్యులు మహేష్‌యాదవ్, మధుకర్‌యాదవ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు

● **సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ అధ్యక్షుడు వెంకట్‌రావు**

అల్వాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను తెలుగు రాష్ట్రాలు రాష్ట్ర పండగగా గుర్తించాయని సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ అధ్యక్షుడు వెంకట్‌రావు అన్నారు. ఆదివారం అల్వాల్‌లోని సత్యసాయి సేవా మందిరంలో శతజయంతి వేడుకలను పురస్కరించుకొని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం మున్సిపల్ కార్మికులను ఆయన సన్మానించారు. నవంబర్ 1 నుంచి 23వ తేదీ వరకు సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను పుట్టపర్తిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాని నరేంద్రమోదీతో పాటు ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో పాటు అధికారులు ఈ వేడుకలకు హాజరవుతున్నారని వెంకట్‌రావు వెల్లడించారు. గోపికృష్ణ, సోమసుందరం, ఆనంద్, ఈశ్వర్‌రావు, ఉమాపావని పాల్గొన్నారు.

ఏ పోరాటానికైనా సిద్ధం : మందకృష్ణమాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: ఆత్మగౌరవం కంటే తమకు ఏదీ ముఖ్యం కాదని, దళిత జాతి ఆత్మగౌరవానికి ఆటంకం కలిగితే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ఉస్మానియా వర్సిటీలోని జి.రామ్ రెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ అధ్యక్షత నిర్వహించిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయిపై జరిగిన దాడి కులాహంకారదాడి అని అన్నారు. ఈనెల 27న హైదరాబాద్‌లో జరగబోయే "దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ"కి వేలాదిగా తరలివచ్చి చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

బోరబండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. బోరబండ డివిజన్ సైట్-3 కాలనీలో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్‌కు మద్దతుగా ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేశారు. మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను టీ.రాజయ్య విజ్ఞప్తి చేశారు. అంతకుముందు స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లోని చర్చిలో ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పూర్వ వైభవానికి కృషి: కోట నీలిమ


కోట నీలిమ

సికింద్రాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ తెలిపారు. అటు పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ఇటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి యత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో విస్తృతంగా పర్యటించడం వల్ల కాలనీలు, బస్తీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్నదని ఆమె చెప్పారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో నిరంతరం ప్రజా సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళుతూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మునుపటితో పోలిస్తే ప్రస్తుతం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోందని, అందుకే నిత్యం ప్రజల్లో ఉంటున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా పార్టీని మరింత పటిష్టం చేస్తున్నట్లు కోట నీలిమ వెల్లడించారు. ఆయా సంక్షేమ పథకాల ఫలాలు అర్హులందరికీ అందేలా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.



రాష్ట్రబంద్‌తో చరిత్ర సృష్టించాం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ జేఏసీ ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర బంద్ చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొన్నటి రాష్ట్ర బంద్ ఒక ట్రైలర్ మాత్రమే అని, బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించే వరకూ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. దీపావళి తర్వాత భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. బంద్‌కు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక ఉద్యమ శక్తులు, బీసీ సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓయూ బీసీ విద్యార్థి సంఘం ఇన్‌చార్జి బొల్లెపల్లి స్వామి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కెపి.మురళీకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కానకాల శ్యాం కురుమ, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మని మంజరి సాగర్, గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దిటి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్





టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు అవసరం

- ఏసీపీ శశాంక్‌రెడ్డి



బౌద్ధనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిన్నపిల్లలు క్రాకర్స్ కాల్చేటప్పుడు తల్లితండ్రులు దగ్గర ఉండాలన్నారు. ప్రమాదాలను నివారించటానికి ఇసుక, నీళ్లు, బ్లాంకెట్స్ తదితర వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. శబ్దం తక్కువ వచ్చే టపాసులను కాల్చితే సౌండ్ పొల్యూషన్ ఉండదన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి 8 నుంచి 10 లోపు మాత్రమే క్రాకర్స్ కాల్చాలన్నారు. సెక్షన్67(సి) హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం క్రాకర్స్‌ను రోడ్లమీద కాల్చరాదని, కాల్చి రోడ్లమీద విసిరి వేయటం నేరమన్నారు. కుటుంబసభ్యులతో సంతోషకరంగా దీపావళి పండుగ జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.






ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనకదుర్గ ఆలయంలో పూజలు

బౌద్ధనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరక చతుర్థశిని పురస్కరించుకుని ఆదివారం బౌద్ధనగర్ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి వివిధ రకాల పూలతో అలంకరణ చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయచైర్మన్ కొట్టె ధరణీధర్, ప్రధానార్చకులు శ్రీనివాసపంతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

















బాధితులకు అండగా ఉంటా

● జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్

తిరుమలగిరి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి విస్తరణలో కంటోన్మెంట్ బీ3 కేటగిరికి సంబంధించిన సుమారు 80 మెయిన్ రోడ్డు భవన యజమానులు గత ఏడాది నుంచి కంటోన్మెంట్ బోర్డు, మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ వినతి పత్రాలు అందజేశారు. ఇంతవరకు వారికి ఎటువంటి హామీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కంటోన్మెంట్ 8వ వార్డు లకడావాల బస్టాప్ వద్ద బీ3 భవన యజమానులు ఏర్పాటు చేసిన సమావేశానికి రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీష్ గుప్తాను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి తమనకు జరిగిన నష్టాన్ని సతీష్ గుప్తాకు వివరంగా తెలియజేశారు. సతీష్ గుప్తా మాట్లాడుతూ బీ3 యజమానులు కూడా రాజీవ్ రహదారిలో భాగమే అని అయితే బీ3 భూములను ఫ్రీ హోల్డ్ చేసి వారికి కూడా అందరికీ ఇచ్చే విధంగా నష్టపరిహారం ఇవ్వాలని న్యాయం జరిగే వరకు మీకు తోడుగా ఉంటామని వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ర్యాలీగా వెళ్లి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులు శ్రీకుసుమ్, విశాల్, శ్రీకాంత్, విక్టోరియా, ఈశ్వర్ గౌడ్, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్ రహదారి విస్తరణ బాధితుల నిరసనలు

ఆత్మగౌరవానికి ఆటంకం కలిగితే.. ఏ పోరాటానికైనా సిద్ధం

● మందకృష్ణ మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మగౌరవం కంటే తమకు ఏదీ ముఖ్యం కాదని, దళిత జాతి ఆత్మగౌరవానికి ఆటంకం కలిగితే ఎంతటి పోరాటానికైనా సిద్ధమని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని జి.రామ్ రెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ అధ్యక్షత నిర్వహించిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయిపై జరిగిన దాడి కులాహంకార దాడి అని అన్నారు. దళితుల ఆత్మగౌరవానికి ఇది పెద్ద దెబ్బ అని పేర్కొన్నారు. దళితుల ఆత్మగౌరవ పోరాటాల చరిత్ర ఎంఆర్‌పీఎస్ దేనని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, మండలాల నుంచి విద్యార్థులు అక్టోబర్ 27న హైదరాబాద్‌లో జరగబోయే "దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ"కి వేలాదిగా తరలివచ్చి చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు డా. సోమశేఖర్ మాదిగ, రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్కెర ముకేశ్ మాదిగ, ఓయూ అధ్యక్షుడు మంద రాజు మాదిగ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జనపాల మహేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఓయూలో అంతర్జాతీయ పర్యాటక సదస్సు విజయవంతం

సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌పై కీలక చర్చలు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన 'గ్లోబల్ టూరిజం: న్యూ అవెన్యూస్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సదస్సులో ఏడు రాష్ట్రాల నుంచి 850 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో ఎనిమిది టెక్నికల్ ట్రాక్స్ ద్వారా గ్లోబల్ టూరిజం పాలసీలు, మెడికల్ టూరిజం, స్మార్ట్ టూరిజం, తెలంగాణ టూరిజం పాలసీ 2025-2030 వంటి అంశాలపై చర్చించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం హాజరై టూరిజం రంగంలో స్టార్టప్‌లు, ఎంట్రప్రెన్యూర్‌షిప్ అవసరాన్ని వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఉస్మానియా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి విస్తృత స్థాయి సదస్సును నిర్వహించిన వాణిజ్య విభాగాన్ని అభినందించారు. సదస్సు ద్వారా వచ్చిన పరిశోధన ఫలితాలు పాలసీ రూపకల్పనకు దోహదం చేస్తాయని టీజీసీహెచ్ఈ కార్యదర్శి సీనియర్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, యాజీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ గోపిచంద్ అభిప్రాయపడ్డారు. సదస్సు డైరెక్టర్ సీనియర్ ప్రొఫెసర్ డి.చెన్నప్ప మాట్లాడుతూ సదస్సు ద్వారా ఓయూ పర్యాటక పరిశోధన రంగంలో మరింత బలమైన స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.గంగాధర్, కన్వీనర్లు ప్రొఫెసర్ కృష్ణచైతన్య, ప్రొఫెసర్ ఇంద్రకాంతి శేఖర్, ప్రొఫెసర్ ఎ.పాట్రిక్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులోని అంశాలను బుక్‌లెట్ రూపంలో ఆవిష్కరిస్తున్న అతిథులు, ప్రొఫెసర్లు

రెజ్లింగ్ విజేతలకు సత్కారం

సికింద్రాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 రెజ్లింగ్ పోటీల్లో సత్తా చాటి, రజత పతకాలు సాధించిన రాంచరణ్, ప్రణీత్‌కుమార్‌లను ఆదివారం కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సత్కరించారు. రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, దుర్గయ్య, వాసుగౌడ్, కరణ్‌సింగ్, వెంకటేష్, సత్యనారాయణ, యాదగిరి, మధు, సురేష్, బచ్చన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.


రెజ్లింగ్ విజేతలను సత్కరిస్తున్న జంపన

రైళ్లలో పెరిగిన రద్దీ

హైదరాబాద్: పండుగల వేళ శనివారం సికింద్రాబాద్ స్టేషన్‌తో పాటు ఢిల్లీ, ముంబై, సూరత్, తదితర ప్రాంతాల నుంచి 275కు పైగా ప్రత్యేక రైళ్లను నడిపామని అధికారులు తెలిపారు. ప్రత్యేక రైళ్లలో ఒక్క రోజే 10లక్షల మందికి పైగా ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకున్నారని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఈ నెల 21న విశాఖపట్నం నుంచి చర్లపల్లికి, 22న చర్లపల్లి నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక రైళ్లను నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.





ఉచిత వైద్యశిబిరం

బౌద్ధనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో స్థానిక కార్పొరేటర్ కంది శైలజ పాల్గొన్నారు. వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కోరారు. మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, వైద్యులు పాల్గొన్నారు.









ఓయూలో రీసెర్చ్ మెథడాలజీ కోర్సు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పది రోజుల పాటు జరగనున్న "ఐసీఎస్ఎస్ఆర్ స్పాన్సర్డ్ రీసెర్చ్ మెథడాలజీ కోర్సు" నోటిఫికేషన్‌ను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం విడుదల చేశారు. ఈ కోర్సు నవంబర్ 10 నుంచి 20 వరకు కొనసాగనుంది. ఈ కోర్సును భారత సామాజిక శాస్త్ర పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్) ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ భూగోళశాస్త్ర విభాగం నిర్వహించనుంది. పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టరల్ పరిశోధకుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కోర్సు పరిశోధన నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో దోహదం చేస్తుందని వీసీ తెలిపారు.









రైలు ప్రయాణమా.. జర భద్రం

ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పండుగ వేళలో రైళ్లలో ప్రయాణించే మహిళలు నగలు ధరించి ప్రయాణం చేయవద్దని సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్ సూచించారు. దీపావళి సందర్భంగా సికింద్రాబాద్ నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే పలు రైళ్లు రద్దీగా ఉంటాయని, నగలు ధరించి ప్రయాణం చేయవద్దని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు తోటి ప్రయాణికుల్లా నటిస్తూ రైలు ఎక్కే క్రమంలో నగలను కొట్టేస్తారని, ఈ విషయంలో జాగ్రత్త అవసరమని తెలియచేశారు.

రైలు ప్రయాణంలో మీ లగేజీలో దాచుకున్న ఆభరణాలను తరుచుగా చూసుకోకుండా జాగ్రత్త పడాలి. ఈ విషయంలో అప్రమత్తంగా ఉండే దొంగలు బ్యాగులో నగలు ఉన్నాయని భావించి బ్యాగును కాజేస్తారు. హర్యాన, మహరాష్ట్రకు చెందిన దొంగలు సికింద్రాబాద్‌కు జనరల్ టికెట్ తీసుకుని ప్రయాణం చేస్తూ మీ బ్యాగులో మీకు తెలియకుండానే జిప్ తీసి అందులో ఉన్న పర్సు, చిన్న బ్యాగులు దొంగిలిస్తారు. మీతో మాట్లాడుతూనే మాయమాటలు చెప్పి చోరీలకు పాల్పడుతుంటారు. ఈ పది రోజుల్లోనే ఇలాంటి ఘటనలు జరుగుతుండటంతో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రయాణ సమయంలో మీ పక్కన ఉన్నవారి కదలికలను గమనించండి. తోటి ప్రయాణికులు బిస్కెట్లు, తినుబండరాలు ఇస్తే తీసుకోకుండా నిరాకరించండి. అందులో మత్తు పదార్థాలు కలుపవచ్చు. ఇలాంటి ఘటనలు ఎదురయితే 139 నంబరుకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.

సికింద్రాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి రిజర్వేషన్ టికెట్ మీరు తీసుకున్నప్పటికీ కొందరు రిజర్వేషన్ బోగిలోకి ఎక్కుతుంటారు. రైల్వే టీటీకి వచ్చే స్టేషన్‌లోనే దిగిపోతామంటూ మాయమాటలు చెబుతూ చోరీలకు పాల్పడుతుంటారు. ముఖ్యంగా కిటికి వద్ద కూర్చోన్న మహిళలు తమ నగల్ని జాగ్రత్తగా చూసుకోవవాల్సిన బాధ్యత మీపై ఉంది.


రైలులో జరిగే మోసాలపై మైకులో అనౌన్స్‌మెంట్ చేస్తున్న ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్

ఐహెచ్‌ఆర్‌పీఐ ఉపాధ్యక్షుడిగా వీరేశం గుప్త


కటకం శ్రీనివాస్ చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యక్షుడు ఎల్లంకి వీరేశం

అడ్డగుట్ట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడిగా తుకారాం గేట్‌కు చెందిన ఎల్లంకి వీరేశం గుప్త నియమతులయ్యారు. ఆదివారం నారాయణగూడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌సీఐ జాతీయ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ చేతుల మీదుగా నియమాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వీరేశం మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించిన ఐహెచ్‌ఆర్‌సీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కాల్వ వీరేందర్, కోశాధికారి సరఫ్ రజినేష్, అసిస్టెంట్ కోశాధికారి తులసి, రాష్ట్ర అధ్యక్షుడు వడకట్టు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి ఐత భాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వాసవి సేవారత్న అవార్డును వాసవి ఆర్ట్ థియేటర్ చైర్మన్ నీల శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు.

శ్మశానవాటికల్లో పూజల కోసం ఏర్పాట్లు


శ్మశాన వాటికలో సిబ్బందితో మాట్లాడుతున్న జంపన

సికింద్రాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున తమ పూర్వీకుల సమాధుల వద్ద పూజలు చేసేందుకు శ్మశానవాటికల్లో ఏర్పాట్లు చేసిన కంటోన్మెంట్ బోర్డు అధికారులకు కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం బోయినపల్లి చిన్నతోకట్ట, బాపూజీనగర్, ఓల్డ్‌ఎయిర్‌పోర్టు రోడ్డులోని శ్మశాన వాటికలను ఆయన సందర్శించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని పూర్వీకుల సమాధుల వద్ద పూజలు చేసేందుకు వచ్చే ప్రజల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. మరణించిన వారి ఆత్మకు పూజలు చేయడం వల్ల శాంతి కలుగుతుందని విశ్వసిస్తుంటారని ఆయన తెలిపారు. పూజలు చేసిన అనంతరం సమాధుల వద్ద నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా ఆయన పేర్కొన్నారు.

సునీత తరపున ప్రచారం

ముషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరపున ముషీరాబాద్ డివిజన్ నుంచి బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహా ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు శివముదిరాజ్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, జావిద్‌ఖాన్, మోహిన్ తదితరులు ఓటర్‌లను కలిసి సునీతను గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, శ్రీకాంత్ యాదవ్, నాని, భాస్కర్, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.



అమ్మకందారులు, కొనుగోలు దారులతో దీపావళి శోభ

మల్కాజిగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి అమ్మకం, కొనుగోలు దారులతో మల్కాజిగిరిలో దీపావళి శోభ కన్పించింది. పూలు, దీపంతలు, లక్ష్మీదేవి ప్రతిమలు, బొమ్మలు, స్వీట్లు, విద్యుత్ దీపాలు పండ్లు తదితర వస్తువుల కొనేందుకు వచ్చిన ప్రజలతో మల్కాజిగిరి చౌరస్తాలో పండుగ వాతావరణం కన్పించింది.

రకరకాల బొమ్మలు అమ్మకాలు చూపరులను ఎంతగానో ఆకర్షించేలా ఉంచారు. వివిధ రకాల స్వీట్లతో తీపిప్రియుల కోసం స్వీటు షాపుల్లో జాతర వాతావరణం నెలకొంది. ఇండ్లకు విద్యుత్ కాంతులతో దగదగ మెరిసే రకరకాల విద్యుద్దీపాలను కొనుగోలు చేసేందుకు చౌరస్తాలోని జై భవానీ ఎలక్ట్రికల్ షాపు కొనుగోలు దారులతో కళకళలాడింది. వీటితో పాటు గుమ్మానికి తోరణాలు అమ్మేవారు, మామిడి ఆకులు, పూలు అమ్మేవారితో కొనేవారితో మల్కాజిగిరి ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది.

దీపావళిని సంతోషంగా జరుపుకోవాలి

● **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

నేరేడ్‌మెట్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగను సంతోషంగా సేఫ్‌గా జరుపుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఆదివారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని యాప్రాల్‌లోని సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దీపావళి సందర్భంగా పేద పిల్లలకు ఉచితంగా టపాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగలను ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం దేవినగర్‌లోని బీజేపీ కార్యకర్త ఇంట్లో మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ కొత్తపల్లి మీనాఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రవణ్, బీజేపీ నాయకులు ఆర్‌కే శ్రీను, భాను ప్రకాష్, ఉపేందర్‌రెడ్డి, ఆధిత్య, డాక్టర్ సత్యనారాయణ, ధనలక్ష్మి, బండి రమేష్, రమణారెడ్డి, శర్మ, పరాస్‌జైన్, పర్వతాలు, శ్యామ్, ఆకారంసాయి, పవన్, కృష్ణకుమారి ఇతర నాయకులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలకు రండి

ముషీరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సదర్ వేడుకలకు హాజరుకావాలని మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎండ్ల హరిబాబు యాదవ్ ఆహ్వానించారు. ఆదివారం ఆయన్ను కలిసి ఆహ్వాన కార్డును అందజేశారు. ఈ సందర్భంగా సదర్ వేడుకల వివరాలను, హరియాణా, పంజాబ్ రాష్ట్రాల నుంచి భారీ దున్నలను ఉత్సవాలకు తీసుకు వచ్చామని కేటీఆర్‌కు వివరించారు. వైభవంగా నిర్వహించే ఈ వేడుకలకు రావాలని కోరారు. అనంతరం ఉత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వరుణ్ యాదవ్, అభినందన్ యాదవ్, సాయి యాదవ్, వీరేష్, వేణు యాదవ్, శంకర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


రైల్వే పార్సిల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న రైల్వే బాంబ్ డిస్పోజబుల్ ఎస్సై కరుణామూర్తి

రైల్వేస్టేషన్‌లో బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : దీపావళిని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే బాంబ్ డిస్పోజబుల్ ఎస్సై కరుణామూర్తి ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వే పార్శిల్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ కార్యాలయంలో ఉన్న పార్శిల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అదేవిధంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పది ప్లాట్ ఫాంలలో బృందం తనిఖీలు నిర్వహించింది.



వర్సిటీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఓయూ విద్యార్థులు, స్కాలర్స్ విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర విద్యా కమిషన్‌ను కోరారు. తెలంగాణ ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేష్, ప్రొఫెసర్ పద్మజాషాలను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిని నియమించాలని, టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఓయూ అభివృద్ధికి ప్రతి ఆర్థిక సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. ఎన్ఈపీని రాష్ట్రంలో అమలు చేయకుండా, ప్రత్యేక విద్యా విధానాన్ని రూపొందించాలని సూచించారు. రీసెర్చ్ స్కాలర్స్‌కి ప్రతి నెల 25 వేల ఫెలోషిప్ ఇవ్వాలని, వర్సిటీలో విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు, ఆచార్యులకు వీసీ అందుబాటులో ఉండాలని చెప్పారు. వీసీ విద్యార్థి వ్యతిరేక విధానాలను విద్యా కమిషన్ ఎదుట ఏకరువు పెట్టారు.


విద్యా కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు


శ్రీగణేశ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న భక్తులు

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి: శ్రీగణేశ్

సికింద్రాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. 3వ వార్డులోని మడ్‌ఫోర్టు తులకాంతమ్మ ఆలయంలో పవర్‌బోర్ చెడిపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి మొరపెట్టుకున్నారు. దాంతో ఆయన సానుకూలంగా స్పందించి ఆలయంలో బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో తాగునీటి శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించినట్టు తెలిపారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు.









